క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడు మృతి

గార: అంపోలు పంచాయతీ మంగళవారంపేటలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన స్వల్ప వివాదంలో గాయపడిన వృద్ధుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న బానాల కుటుంబాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో బుర్లల్లి పెంటయ్య (82) సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. బానాల రాజేశ్వర్, లక్ష్మీ, చిన్నారావు వృద్ధుడిపై దాడి చేయడంతో తల, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా వారం రోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. బుధవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు, ఎస్సై ఆర్.జనార్దన్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రాల పనితీరుపై ఆరా


యంత్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు

జి.సిగడాం: జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా 2024లో జి.సిగడాం మండల కేంద్రంలోని రైతులకు మంజూరు చేసిన వ్యవసాయ యంత్రాలను పనితీరును రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం అధికారి మధులేటి, ఏడీఏ సురేష్‌పాన్, రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నూర్పిడి యంత్రాల రాయితీపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి యర్రా శారద, అగ్రికల్చర్ అసిసెంట్లు ముంతా హేమంత్‌కుమార్, కుమరాపు సుగుణాకరరావు, కె.అప్పారావు, యుగంధరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి ఆరాధనోత్సవం


వంద గంటల దివ్యనామ సంకీర్తన చేస్తున్న సాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి బృందావనంలో గురువారం సత్యసాయి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద గంటల దివ్య అఖండ భజన కార్యక్రమం ప్రారంభమైంది. ముక్తేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, పల్లకి ఉత్సవం, పుష్పార్చనలు, విష్ణుసహస్రనామ పారాయణలు జరిగాయి. కార్యక్రమంలో మందిరం కన్వీనర్, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 26న బుడగట్లపాలెంలో చేపట్టనున్న పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బుడగట్లపాలెంలో ఏర్పాట్లు పరిశీలించారు. ముఖ్య మంత్రి మత్స్యకార చేయూత పథకాన్ని ప్రారంభిస్తారని, రాష్ట్రంలో రూ.258 కోట్లను లబ్ధిదారులకు అందజేయనున్నారని వివరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి కూడలి వద్ద నినాదాలు చేస్తున్న శర్వాణి విద్యార్థులు


ఎచ్చెర్ల క్యాంపస్: నివాళులు అర్పిస్తున్న రైజింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు


శ్రీకాకుళం రూరల్: నివాళులు అర్పిస్తున్న క్రాంతి విద్యానికేతన్ విద్యార్థులు

ఉగ్రవాదం ప్రమాదకరం


రణస్థలం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- పహల్గాం మారణకాండను ప్రతిఒక్కరూ ఖండించాలి
- కొవ్వొత్తుల ర్యాలీల్లో వక్తలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : ప్రపంచ దేశాలన్నీ పహల్గాం దారుణ మారణకాండను ఖండించాలని, శాంతియుతమైన భారతదేశంపై ఉగ్రదాడులు జరిపిన పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించి వెలివేసేందుకు ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, హారికా ప్రసాద్, కరణం శోభారాణి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, మణిశర్మ, తర్లాడ అప్పలనాయుడు, లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, మజ్జి సుమన్, హారిక చందక నీహార్‌నాయుడు, పార్వతీశ్వరరావు, జ్యోతిర్మయి, వాసు పాలిశెట్టి మధుబాబు, బాలాజీ, మీసాల మాధవి తదితరులు పాల్గొన్నారు

➾ రణస్థలం: ఉగ్ర దాడిలో మరణించిన కుటుంబాలకు సంఘీభావంగా రణస్థలంలో ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జామియా మసీద్ నుంచి రామతీర్థం కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీతో వెళ్లి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్ద, జిల్లా జేఏసీ కన్వీనర్ షేక్ సలీమ్ బాయ్ మాట్లాడుతూ ఉగ్రదాడిని ఖండించారు. మృతి చెందినవారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ర్యాలీలో సయ్యద్ అలీ, సైదాల్, సర్దార్, చిన్న మస్తాన్, పెద్ద మస్తాన్, ఉర్దూస్ తదితరులు పాల్గొన్నారు.

➾ శ్రీకాకుళం అర్బన్: పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని శర్వాణి విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు అన్నారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా గురువారం అరసవల్లి కూడలి వద్ద శర్వాణి విద్యాలయ విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంధవరపు ఆంజనేయులు, హెచ్ఎం కె.రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

➾ ఎచ్చెర్ల క్యాంపస్: జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని రైజింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఖండించింది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం మృతులకు నివాళులు అర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎమ్మెస్సార్ మూర్తి, కార్యదర్శి రత్నాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

➾ శ్రీకాకుళం రూరల్ : ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్ విద్యార్థులు నివాళులు అర్పించారు. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ గుండ అమ్మడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బెర్మ్‌లకు మోక్షమెప్పుడో?


జె.ఆర్.పురంలో సీసీ రోడ్లు వేసి నెలలు గడుస్తున్నా కానరాని బెర్మ్‌లు

- ప్రమాదకరంగా సీసీ రోడ్ల అంచులు
- వాహనచోదకులకు తప్పని పాట్లు

రణస్థలం: ఇటీవల కుటమి ప్రభుత్వం హడావుడిగా చేపట్టిన సీసీ రోడ్ల పనులతో వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. పల్లెపండుగ పేరిట నిర్మించిన సీసీ రోడ్లకు ఇరువైపులా బెర్మ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అంచులు పదునుగా మారి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు పనుల్లో నాణ్యతా లోపం, మరోవైపులా బెర్మ్‌లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు ఎదురెదురుగా వస్తే పక్కకు దిగే అవకాశం లేకుండాపోతోంది. వాస్తవానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే గ్రావెల్, మట్టితో బెర్మ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

పనులు పూర్తి చేయాలి

కూటమి ప్రభుత్వం అర్ధంతరం పనులు వదిలేయడం దారుణం. బెర్మ్‌లు వేసి సీసీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి.

– గొర్లె శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, రణస్థలం

ఆదేశాలు జారీ చేస్తాం

కాంట్రాక్టర్లకు చెప్పి సీసీ రోడ్డులకు ఇరువైపులా బెర్మ్‌లు వేయిస్తాం. బెర్మ్‌లు, వాటరింగ్ అన్నీ కలిపే అంచనా నిధులు రూపొందించాం. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమాచారమిస్తాం.

– సనపల శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈఈ

చలివేంద్రం ఏర్పాటు


తహశీల్దార్‌కు మినరల్ వాటర్ అందిస్తున్న సంఘు సభ్యులు

గార: పెరుగుతున్న ఎండల దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహశీల్దార్ మునగవలస చక్రవర్తి అన్నారు. గురువారం శ్రీకూర్మం జంక్షన్ బీవీఆర్ కాంప్లెక్సులోని తాత్కాలిక భవనం వద్ద మండల శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కస్పా ప్రభాకరరావు, మురళీకృష్ణ, అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సెక్రటరీ కె.సాయిరాం, కోశాధికారి వెంకటరమణ, సీహెచ్.ఆనంద్, చౌదరి శ్రీనివాస్, రమణ, సురేష్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.


జి.సిగడాం:మజ్జిగ పంపిణీ చేస్తున్న సాయికుమార్

బాతువలో చలివేంద్రం

జి.సిగడాం: బాతువ గ్రామంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కలిశెట్టి శాంతారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆబోతుల జగన్నాథం, కలిశెట్టి మణికంఠ, చిక్కాల శ్రీనివాసరావు, కొర్రాయి అప్పారావు, సూర్యారావు, రామారావు, నారాయణరావు, అప్పలనాయుడు, సూర్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు



రాగోలు పరిశోధన కేంద్రంలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


శ్రీకాకుళం రూరల్: రైతులు యాజమాన్య, శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. రాగోలులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయానికి చెందిన వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ కె భాగ్యలక్ష్మీ, పలువురు రైతులు పాల్గొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ జానకి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ అండ్ కంట్రీ ప్లానింగ్, విశాఖపట్నం ఆదేశాల మేరకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందు నగరపాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభంజనం


కె.హాసిని


కె.సాయిస్పందన


ఎస్ఎస్‌వీ లహరి


సీహెచ్.కార్తీక్

శ్రీకాకుళం అర్బన్: పాత శ్రీకాకుళంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో సత్తాచాటారు. కె.హాసిని, కె.సాయిస్పందన(593), ఎస్ఎస్‌వి లహరి(592), సీహెచ్ కార్తీక్(591) మార్కులు సాధించారు. మొత్తం 58 మంది పరీక్షలకు హాజరుకాగా 12 మంది 580కు పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్యరాణి తెలిపారు. వరుసగా 14వ ఏడాది కూడా పదో తరగతిలో శతశాతం మార్కులు సాధించినట్లు చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మణికొండ ఆదినారాయణమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తంగి హరినారాయణ, ఎం.హరనాథరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కమిటీ ప్రతినిధులు

ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గంజి భీమారావు, కరగాన భాస్కరరావు, అనుపోజు కామేశ్వరరావు, పనస.రమేష్, పడిమి శ్రీను, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నక్షత్ర తాబేళ్ల రక్షణ ప్రభుత్వానిదే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకూర్మం క్షేత్రంలో నక్షత్ర తాబేళ్ల పరిరక్షణ, ఆలయ నిర్వహణ సక్రమంగా లేకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు ఆలయ నిర్వహణపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లే నక్షత్ర తాబేళ్లు మృతిచెందాయన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో శ్రీకూర్మం ఆలయ పరిరక్షణకు అనేక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కూటమి నేతలు హామీలు గుప్పించడం తప్ప చేస్తున్నదేమీ లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తాబేళ్ల పరిరక్షణపై పూర్తిస్థాయి దృష్టి సారించాలన్నారు.

స్వర్ణ కిరీటానికి విరాళాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి బంగారు కిరీటం నిమిత్తం పలువురు దాతలు గురువారం విరాళాలు అందించారు. ఎల్లుమహంతి పాత్రో రూ.50వేలు, వేణుగోపాల్, మంజులత దంపతులు రూ.10వేలు విరాళంగా అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో పంచాయతీలు బలోపేతం

గార: సచివాలయ వ్యవస్థ ద్వారా పంచాయతీలు బలోపేతమయ్యాయని ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ అన్నారు. గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకొని గార మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ సేవలందించిన బోర్ మెకానిక్ కె.ధర్మరాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహన్‌రావు, సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్ , అధికారులు పాల్గొన్నారు.


గార: పంచాయతీరాజ్ దినోత్సవంలో నాయకులు, అధికారులు


జి.సిగడాం: దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జి.సిగడాం: పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల వెంకటరమణ అన్నారు. గురువారం జి.సిగడాం మండల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక సచివాలయంలో సర్పంచ్ పెయ్యల నాగమణి ఆధ్వర్యంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా లావేరు ఎంపీడీవో పి.వెంకటరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ, టైపిస్ట్ పవన్‌కళ్యాణ్‌లు అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు ప్రశంసాపత్రాలను జిల్లా కేంద్రంలో అందించారు. అదే విధంగా, ఉత్తమ పంచాయతీరాజ్ అధికారిగా ఎచ్చెర్ల మండల పరిషత్ పరిపాలన అధికారి పీపీ ఎస్.రామ్మోహన్‌రావు అవార్డు అందుకున్నారు.

శక్తి యాప్‌తో రక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సీఐ త్రినేత్రి అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో యాప్ ద్వారా పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి రవి, వీసీ రజిని, ఎన్ఎస్ఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వనజ పాల్గొన్నారు.

నేటి నుంచి పౌరాణిక ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 25, 26వ తేదీలలో పౌరాణిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కళాకారులు బి.ఎ.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 25న సభాకార్యక్రమంతో ప్రారంభమై ప్రముఖ పౌరాణిక కళాకారులు ధూపం రామకృష్ణ(అనంతపురం) 'గాన కిరీటి' బిరుదు ప్రధానం, రజిత మకుట బహూకరణ జరుగుతుందని పేర్కొన్నారు. కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర తదితర ప్రదర్శనలు జరుగుతాయని, అభిమానులంతా పాల్గొనాలని కోరారు.